ప్రజాశక్తి
శుక్రవారం 30 డిసెంబర్ 2022
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

హక్కుల రక్షణకు కార్మికవర్గ సమరభేరి

- ప్రభుత్వరంగ సంస్థలను ప్రజలే కాపాడుకోవాలి
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ఉద్ఘాటన
- విశాఖలో కార్మిక చైతన్యయాత్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, కలెక్టరేట్

'నేడు విశాఖ నగరం ఇంత కళకళ లాడుతుందంటే స్టీల్‌ప్లాంట్, పోర్టు వంటి ప్రభుత్వ రంగ సంస్థలే కారణం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అయిపోతున్నాయి. వీటిని కాపాడుకుంటూ, హక్కుల రక్షణ కోసం 'కార్మిక వర్గం సమరభేరి' సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా నుంచి గురువారం విశాఖలో అడుగుపెట్టిన సిఐటియు కార్మిక చైతన్య యాత్రకు నగరంలోని వివిధ రంగాలకు చెందిన సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల నుంచి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన బహిరంగ సభలో సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, ఒకప్పుడు 7వేల మంది పనిచేసిన షిప్‌యార్డులో నేడు 700 మందే మిగిలారని, భెల్‌లో 5వేల మంది ఉంటే నేడు 500 మందికి కుదించబడ్డారని, స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్రం నిర్ణయించిందని, దీనిపై కార్మికవర్గం, ప్రజానీకం రెండేళ్లుగా పోరాడుతున్నారని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో కార్మిక సమస్యలపై ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడే సత్తా సిఐటియుకు ఉందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు ఆ సమర్థత లేదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి కార్పొరేట్లకు దాసోహం అవుతూ రూ.25వేల కోట్లతో నిర్మించిన జెన్‌కో ఆధునిక విద్యుత్ ప్లాంట్లను అదానీకి కట్టబెట్టడానికి కేబినెట్ తీర్మానించడం దారుణమన్నారు. రైళ్లనీ మిగతా 2లో..

కాలపరిమితి సర్క్యులర్ 64ను..

రద్దు చేయాల్సిందే

- విఓఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర 4వ మహాసభ డిమాండ్
- ఉత్సాహంగా ప్రారంభం

మాట్లాడుతున్నవిఓఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

విఓఎ మెడపై కత్తిలా వేలాడుతున్న సర్క్యులర్ 64/11 రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయాలని విఓఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర 4వ మహాసభ డిమాండ్ చేసింది. సర్క్యులర్ రద్దయ్యే వరకు పోరాటం కొనసాగించాలని మహాసభ తీర్మానించింది. 40 ఏళ్లు దాటకూడదని, పదో తరతగతి విద్యార్హత ఉండాలని, పురుషులు ఉండకూడదన్న ఆంక్షలు ఎత్తివేసి, సర్క్యులర్ 64 రద్దు చేయాలని, విఓఎ, ఆర్‌పిల పనులను వాలంటీర్లకు అప్పగించే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధనలక్ష్మి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనకాపల్లిలోని గవరపాలెంలో బి.రాంబాబు ప్రాంగణం, వి.రత్నంనగర్ (వివి రమణ రైతు భారతి కల్యాణ వేదిక)లో ఎపి వెలుగు విఓఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర నాలుగో మహాసభ తొలిరోజైన గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి 250 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. బి.రాంబాబు, వి.రత్నం, మల్లు స్వరాజ్యం, ఆర్.రాజ్యలక్ష్మి చిత్రపటాలకు పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధుల సభలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ధనలక్ష్మి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సభలో మిగతా 2లో..

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

వార్త 2లో..

కేంద్రం అనుమతులు ఇవ్వకుండా మెడికల్ కళాశాలల ఏర్పాటు ఎలా?

వార్త 7లో..

అదుపులో నేరాలు : పోలీసు కమిషనర్ శ్రీకాంత్

వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై...

రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వెల్లడించాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి వెల్లడించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్‌చేశారు. రాష్ట్రానికి సంబంధించి వివిధ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం ప్రధాని నరేంద్రమోడీ నివాసంలో సమావేశమైనప్పటికీ విశాఖ ఉక్కు అంశాన్ని ప్రస్తావించకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేశాం కదా అని చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంవత్సర కాలంగా కార్మికులు, ప్రజలు ఉద్యమం చేస్తుంటే వారి అభిప్రాయాలను గౌరవించకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రానికి, ఉత్తరాంధ్రకు తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు, సొంత మైనింగ్ ఓర్ గనులు కేటాయించాలని, ప్రయివేటీకరించవద్దని ప్రధాని దృష్టికి తీసుకెళ్ళకపోవడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంత దాసోహం అయ్యిందో అర్థమవుతుందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకి వెన్నెముకగా వున్న స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంపై పోరాటానికి సిద్ధంకావాలని కోరారు.

ఈ సమస్యలు పోయేదెప్పుడు?

- ముందుకు కదలని 'తాడి' తరలింపు హామీ
- పురోగతిలేని సుజల స్రవంతి పనులు
- మూతపడ్డ మూడు సహకార చక్కెర ఫ్యాక్టరీలు
- అమలుకాని స్థానికులకు 75 శాతం ఉద్యోగాల కల్పన
- ఫార్మా కంపెనీల్లో ఆగని ప్రమాదాలు
- సిఎం రాకతో ప్రజల్లో పరిష్కార ఆశలు

సిఎం సమావేశానికి జోగినాధునిపాలెం వద్ద సిద్ధమైన వేదిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం టౌన్

జిల్లాలోని మాకవరపాలెం మండలం, భీమబోయినపాలెంలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం నర్సీపట్నం వస్తున్న సందర్భంగా దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తారన్న ఆశతో ప్రజలున్నారు. గతంలో సిఎం హామీ అమలుకాని సమస్యలతో పాటు కొత్తవీ ఆయన దృష్టికి తీసుకెళ్లడానికి నాయకులు సిద్ధమవుతున్నారు. పరవాడ ఫార్మా కంపెనీలకు అనుకొనివున్న తాడిని తరలించేందుకు వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని సబ్బవరం మండలంలో ఇళ్ల పట్టాల పంపిణీకి వచ్చినప్పుడు సిఎం హామీ ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఇంతవరకు తాడి తరలింపు ఒక్క అడుగూ ముందుకుపడలేదు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామన్న జిఒ అమలుకావడంలేదు. విద్యార్హతకల్గిన నిర్వాసిత యువతకు కూడా పరిశ్రమాధిపతులు ఉద్యోగాలు ఇవ్వడంలేదు. ఫార్మా, అచ్యుతాపురం సెజ్‌లో నిత్యమూ ప్రమాదాలు జరుగుతున్నా, నియంత్రణకు యాజమాన్యాలు తీసుకున్న చర్యలు లేవు. భద్రతా ప్రమాణాలు పెంచి కార్మికులు ప్రాణాలు కోల్పోకుండా ప్రమాద నియంత్రిత వ్యవస్థలను బలోపేతం చేసేలా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఈ నెల 26న లారస్ ల్యాబ్ మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం : ఐద్వా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి స్పష్టంచేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 637వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఐద్వా నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు వెనుక 32 మంది బలిదానం ఉందన్నారు. 22 వేల ఎకరాల భూములను రైతులు త్యాగం చేశారని తెలిపారు. ప్రస్తుతం లాభాల్లో నడుస్తున్న ఈ కర్మాగారానికి అవసరమైన సొంత గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలు అయిన ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేయడం బిజెపి పాలకులకు తగదన్నారు. ఈ దీక్షల్లో ఐద్వా నాయకులు ఆర్.విమల, బొట్టా ఈశ్వరమ్మ, కె.మణి, బి.సత్యవతి, డి.కొండమ్మ, కె.కుమారి, గౌరి, శారద తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో నినదిస్తున్న ఐద్వా సభ్యులు

మొదటి పేజీ తరువాయి..

హక్కుల రక్షణకు.. కార్మికవర్గ 'సమరభేరి'

ప్రయివేటు చేయబోతున్నారని, ఇదే జరిగితే ఇప్పుడున్న ఛార్జీలకు 3 రెట్లు పెరగనున్నాయని ఆందోళన చెందారు. తర్వాత పాసింజరు రైళ్లు ఉండవన్నారు. సమస్యలపై కార్మికులు, ప్రజలు ఆలోచించకుండా రాష్ట్రంలోనూ, దేశంలోనూ కుల, మతాల చిచ్చు రగిల్చే కుట్ర వ్యూహాలను బిజెపి చేస్తోందన్నారు. దీన్ని ఎంత త్వరగా కార్మికవర్గం గుర్తిస్తే దేశానికి అంత మేలు అని పేర్కొన్నారు. చిట్టివలస జ్యూట్ మిల్లును గత మంత్రి గంటా శ్రీనివాసరావు అమ్మేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బేబీరాణి మాట్లాడుతూ భీమవరంలో 2023 జనవరి 2 నుంచి 4 వరకూ జరుగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభలు భవిష్యత్తు పోరాటాలకు నాంది కానున్నాయన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని ఎన్నికల ముందు చెప్పిన జగన్ అధికారం చేపట్టాక నెమ్మదిగా వీరిని తొలగించే పనిచేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఐద్వా విశాఖ నాయకులు సత్యవతి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో ఐద్వా ఆధ్వర్యాన పెద్ద ఎత్తున మహిళలు పాల్గొంటున్నారని తెలిపారు. సిఐటియు శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, విజయనగరం జిల్లా కార్యదర్శి సురేష్ ప్రసంగించారు.

కాల పరిమితి సర్క్యులర్ 64ను రద్దు చేయాల్సిందే..

జెండా ఆవిష్కరణలో సంఘం సభ్యులు

సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. రూపావతి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్. శంకరరావు, జి.కోటేశ్వరరావు, వి.ఎ.ఎల సంఘం అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షుడు వివి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు, రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య, ఎపి గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.అరుణ, అల్లూరి సీతారామరాజు జిల్లా వి.ఒ.ఎ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భాను, అన్నమయ్య జిల్లా సంఘం అధ్యక్షుడు రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈ సమస్యలు పోయేదెప్పుడు?

మూడో యూనిట్‌లో జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు చనిపోయారు. నాలుగు సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునీకరించి రైతులకు మేలు చేస్తామని మాట ఇచ్చి, రెండు ఫ్యాక్టరీల క్రషింగ్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. టిడిపి ప్రభుత్వంలో తుమ్మపాల చక్కెర ఫ్యాక్టరీ మూతపడగా, ఈ ప్రభుత్వంలో తాండవ, ఏటికొప్పాక చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఒకానొక్క గోవాడ చక్కెర ఫ్యాక్టరీ ఎంతో కాలం నడిచేలాలేదు. ఈ నాలుగు చక్కెర ఫ్యాక్టరీలను ఆధునీకరించి మేలు చేసే హామీ ఇస్తారన్న ఆశ రైతుల్లో వ్యక్తమవుతుంది.

ఉత్తరాంధ్రలో 8 లక్షల ఎకరాలకు సాగునీరందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. నిధులు సరిపడా విడుదలచేయకపోవడంతో భూ సేకరణ ప్రక్రియలో కూడా పురోగతిలేదు. పోలవరం ఎడమ కాలువ నిర్మాణం పనులకు నిధుల్లేకపోవడంతో వాటి ఊసేలేదు. 200 పడకల సామర్థ్యం కల్గిన అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ పనిచేయక రోగులు అవస్థలుపడుతున్నారు. నర్సీపట్నం కేంద్రంలోని 150 పడకల ఏరియా ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయక నెలలు గడుస్తున్నాయి. నిధుల్లేక మరమ్మతు చేయని పరిస్థితి ఏర్పడింది.

ఆంక్షలు లేవు: ఎస్‌పి గౌతమిశాలి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం నర్సీపట్నం వస్తున్న సందర్భంగా పోలీసులు ఆంక్షలు విధించలేదు. విద్యా, వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు యథావిధిగా తమ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని ఎస్‌పి గౌతమిశాలి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఎపిఎస్‌ఆర్‌టిసిలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 37 మందికి గ్రామ, వార్డు సచివాలయాలలో నియమిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం కలెక్టరేట్‌లో ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నియామకాలు పొందిన వారందరూ క్రమ శిక్షణతో పనిచేసి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎపిఎస్‌ఆర్‌టిసి అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌ఛార్జి అధికారి పూర్ణిమాదేవి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవి కుమార్, రీజనల్ మేనేజర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి కాలనీ : విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి అర్హులైన 37 మందికి పంచాయత్ సెక్రటరీ గ్రేడ్-5, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-6, సంక్షేమశాఖ అసిస్టెంట్, విద్యా శాఖ అసిస్టెంట్‌లుగా కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారని విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పల రాజు చెప్పారు.

అరకు రైలుకు ప్రత్యేక కోచ్‌లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని శని ఆదివారాల్లో విశాఖపట్నం-అరకు-విశాఖపట్నం స్పెషల్‌కు స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేయాలని నిర్ణయించింది. 08501/08502 విశాఖపట్నం-అరకు-విశాఖపట్నం ప్రత్యేక రైలులో డిసెంబర్ 31 నుంచి జనవరి 22 వరకు శని, ఆదివారాల్లో 7 స్లీపర్ క్లాస్ కోచ్‌లు జతచేయనున్నారు. ఈ జంట రైళ్లలో ఏడు స్లీపర్ క్లాస్ కోచ్‌లు, ఏడు జనరల్ క్లాస్ కోచ్‌లు, రెండు సెకండ్ క్లాస్ కమ్ లగేజ్ కోచ్‌లు ఉంటాయి.

నేడు వికలాంగుల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వికలాంగుల డిమాండ్ల సాధన కోసం శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు వై.డేవిడ్‌రాజు తెలిపారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం 3వ రోజైన గురువారమూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మారేడిపూడి రమేష్ బాబు, ఎస్.మల్లీశ్వరి, గరికిన చంద్రశేఖర్, పులిగి శ్రీనివాస్, బి.లక్ష్మణరావు, ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అరసం విశాఖ జిల్లా అధ్యక్షులుగా సీతారత్నం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, రాష్ట్ర అధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ప్రకటించారు. విశాఖ జిల్లా అధ్యక్షులుగా ఆచార్య అయ్యగారి సీతారత్నం, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా ఎస్.హనుమంతరావు, కార్యదర్శులుగా డాక్టర్ సిఎన్.క్షేత్రపాల్‌రెడ్డి, పి.శ్యామసుందర్, విరియాల గౌతమ్ నియమితులయ్యారు. మరి కొంతమందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ, విశాఖ జిల్లా పరిధిలో అరసం విస్తరణకు సాహితీ వేత్తలు, కవులు, రచయితల సహాయ సహకారాలు తీసుకొని ముందుకు వెళతామని చెప్పారు. సాహిత్య విస్తరణకు క్రమం తప్పకుండా సాహిత్య సభలు, చర్చా గోష్ఠి తదితర అంశాలపై అరసం కార్యక్రమాల రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు.

'వైసిపి ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వైసిపి ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లే పరిస్థితి ఉందని బిజెపి జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అభిప్రాయపడ్డారు. లాసన్స్ బే కాలనీలోని బిజెపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ విధించే పరిస్థితి ఉందన్నారు. పరిపాలన రాజధాని పేరుతో జగన్ కొండలను పిండి చేస్తున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం రూ.9 లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. మెట్రో రైలు విషయంలో డిపిఆర్‌ను కేంద్రానికి పంపలేదని చెప్పారు. ఎమ్మెల్సీ మాధవ్, విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

ఐటి ఉత్పత్తుల్లో అట్టడుగున ఎపి

ఐటి ఉత్పత్తుల్లో ఎపి అట్టడుగున ఉందని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు ఆరోపించారు. బిజెపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఐటి సంస్కరణల్లో, సంస్థాగత విజేతల్లో, ఇన్నోవేటివ్ లీడర్లలో ఆంధ్రప్రదేశ్ ఎక్కడా కనిపించడంలేదన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

ప్రజాశక్తి-విశాఖపట్నం : పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు హెచ్చరించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గురువారం అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్‌జి.శాస్త్రి, ఎఎంఒహెచ్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి రోజూ రెండు మూడు గంటలు శ్రమిస్తే నగరంలో చెత్త కనిపించదని, పిన్ పాయింట్ వారీగా పారిశుద్ధ కార్మికులను సర్దుబాటు చేసి నిర్ణీత సమయానికే వ్యర్థాలు తొలగించాలని ఆదేశించారు. ప్రతి రోజు శానిటరీ కార్యదర్శులతో సమీక్షించి ఆయా ప్రాంతాలలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. యూజర్ చార్జీలు మందకొడిగా వసూలవుతున్న దృష్ట్యా వసూలు వేగవంతం చేయాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ దుకాణాలలో అమ్మకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి-విశాఖపట్నం : స్మార్ట్ స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్మార్ట్ సిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్మార్ట్ సిటీ కార్యాలయంలో జివిఎంసి కమిషనర్, స్మార్ట్ సిటీ సిఇఒ పి.రాజాబాబుతో కలిసి సమీక్ష నిర్వహించారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను స్మార్ట్ సిటీ ఛైర్మన్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ఫేజ్-1, ఫేజ్-2 పనుల పురోగతి, సిటీస్ క్రింద చేపడుతున్న స్కూల్ అభివృద్ధి పనులు తోపాటు సోలార్ విద్యుత్ దీపాలు, నీటిపై తేలియాడే సోలార్ ప్రాజెక్టులు, రోడ్ల వివరాలను ఛైర్మన్‌కు అధికారులు వివరించారు.

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE AT: ANAKAPALLI
(In the matter of Guardian ship of minor by name Ganapathiraju Prudhvi)
G.O.P. 13/2022
Between:
Sri Ganapathiraju Raj Kamal, S/o. Appala Venkatanarayana Prasad, D.No.36/47-48, 9th Ward, Rama Rao peta, Narasipatnam, Visakhapatnam District
...Petitioner
And
Smt. Ganapathiraju Vijayalakshmi, W/o. G. Raj Kamal, D/o. Jampana Ramabhadra Raju, Sita Nagaram Tumpala, Anakapalli Visakhapatnam District
...Respondent
జనరల్ నోటీసు
పైన తెలిపిన పిటిషనర్ దాఖలు చేసిన యందలి ఈ పిటిషన్ నందు సదరు పిటిషనర్ వారి యొక్క మైనర్ కుమారుడైన **Ganapathi Raju Prudhvi** ని సంరక్షణకు అప్పగించవలసినదిగా దాఖలు చేసిన యందలి పిటిషన్ యందు ఎవరికైన ఏ విధమైన అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల అట్టివారు మహారాజశ్రీ పై కోర్టు వారి యెదుట తేది. **19-01-2023** ఉదయం గం॥**10:30**ని॥లకు స్వయముగా హాజరయి తెలుపుకొనవలసినదిగా ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియ చేయడమైనది.
(By Order of the Hon'ble Court)
V.V.V.S.S.M. RAJA RAO,
Advocate for Petitioner
Visakhapatnam
Cell: 9440889502

IN THE HONOURABLE COURT OF I ADDITIONAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
O.S.13 2/2022
Between:
MallaKannaji Rao and others
...Plaintiff
And
Peela Sivaji and others
...Defendants
NOTICE
To,
Defendant 3: Kona Venkata Ramana, S/o late Muka Lingam, D.No.3-300/A, Jogipadigramam, main veedhi, koturu Mandal, Neradi, Srikakulam District - 532459.'
SUIT NOTICE
Please take notice that you are the 3rd Defendant in the above suit O.S.132/2022. That, notices in O.S.132/2022 have not been served on you in ordinary way and that the honourable Court was pleased to order notice to you by substituted service by way of paper publication. The said suit O.S.132/2022 stands posted on 06.01.2023 for your appearance. you are therefore hereby called upon to appear either in person or through a duly instructed counsel, before the honourable Court on 06.01.2023 by 10:30 a.m., failing which the O.S. 132/2022 will be decided in your absence as ex parte.
(BY ORDER OF THE COURT)
V.V.RAVI PRASAD,
J.V. RAMA KRISHNA,
Advocates
#45-58-14/1, Ground Floor, Narasimha Nagar, Visakhapatnam-24
Cell: 9848569707

జగన్మోహన్‌రెడ్డి సిఎం కావడమే రాష్ట్ర ప్రజల ఖర్మ

ఇదేం ఖర్మ నిరసనలో మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి - పెందుర్తి : జగన్మోహనరెడ్డి సిఎం కావడమే రాష్ట్ర ప్రజలు చేసుకున్న పెద్ద ఖర్మ అని మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని జెర్రిపోతులపాలెంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ మూడున్నరేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో ఇసుమంతైనా అభివృద్ధి జరగలేదన్నారు. ఇబ్బడిముబ్బడిగా అప్పులు తెచ్చి, సంక్షేమమంటూ ప్రజలకు చిల్లర వేస్తున్నారే తప్ప, శాశ్వతమైన ఉద్యోగం, ఉపాధి, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టుగానీ, పరిశ్రమగానీ చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఒక్క ఛాన్స్ అన్నందుకు నమ్మి అధికారమిచ్చిన ప్రజలను, రాష్ట్రాన్ని నిండా ముంచేశారని, ఇదే జగన్ పాలనలో ప్రజలు చేసుకున్న ఖర్మ అని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమర్థవంతమైన, సుస్థిర పాలనకు తెలుగుదేశం పార్టీని, సిఎంగా చంద్రబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.అప్పలరాజు, తెలుగు మహిళ నేత మడక పార్వతి, మాజీ జెడ్‌పిటిసి రెడ్డి నారాయణరావు, పార్టీ మండల అధ్యక్షుడు కరకదేవుడు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్

పిఎం పాలెం : చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. నెల్లూరుజిల్లా కందుకూరులో జరిగిన టిడిపి ర్యాలీలో దురదృష్టవశాత్తు వీరమరణం పొందిన పార్టీకార్యకర్తలకు నివాళులు అర్పించారు. అనంతరం ఐదవ వార్డులోని పరదేశిపాలెంలో కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో పార్టీ బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులు వాండ్రాసి అప్పలరాజు, తెలుగు మహిళ భీమిలి అధ్యక్షురాలు బోయి రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షులు బోయి వెంకటరమణ(శీను) పర్యవేక్షణలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇదేం ఖర్మ నిరసన ర్యాలీలో మాజీ మంత్రి బండారు

ముందుగా కందుకూరు ర్యాలీలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు ఘననివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, తెలుగు యువత అధ్యక్షులు కొండవు రాజు, బిసిసెల్ భీమిలి అధ్యక్షులు నమ్మి శ్రీను, వార్డు ఉపాధ్యక్షులు ఇయ్యపు నాయుడు, నేతలు గొల్లంగి ఆనంద బాబు, బోర అప్పల సూరిబాబురెడ్డి, సొడిపిల్లి నారాయణరావు, దొరబాబు, పరమేశ్వరావు, కామరాజు, ఆనందరావు, గురువులు, సరస్వతి, నూకరాజు, మన్యాల హనుమంత్ పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో కళావేదిక ప్రారంభం

కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-పిఎం పాలెం : ప్రస్తుత యాంత్రికజీవనంలో ప్రజలకు కాసింత ఉపశమనం కలిగించేందుకు పార్కులు దోహదపడతాయని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు.గురువారం జివిఎంసి ఆరోవార్డు పిఎం పాలె, తులసి నగర్ వాకర్స్ పార్కులో గాది రోశిరెడ్డి కళావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నేత గాది రోశిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్న రోశిరెడ్డిని, కళావేదిక నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో లవ్ ఎన్ కేర్ మినిస్ట్రీస్ ఛైర్మన్ పి. ఏసుపాదం, ప్రెసిడెంట్ బి.అప్పలరాజు, సెక్రెటరీ గాలి లోవరాజు, సెక్రెటరీ జనరల్ వాకర్ ఇంటర్నేషనల్ ఎస్.ఐజాక్, సదాశివ రెడ్డి, బ్రహ్మాజీ, సత్యనారాయణ, షేక్ సుభాని, ఆరో వార్డు వైసిపి అధ్యక్షుడు బొట్ల అప్పలరాజు, పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్, గుంటుబోయిన సంజీవ్, పోతిన సూరిబాబు, కొండపల్లి వరలక్ష్మి పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచలం దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు విజయనగరంలో ఆవిష్కరించారు. తన స్వగృహంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విడుదల చేశారు. సింహాచల దేవస్థానంలో ప్రత్యేక పూజలు అనంతరం దేవస్థానం ధర్మకర్తలమండలి సభ్యులు అప్పన్న క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, చందు యాదవ్, దొడ్డి రమణ, శ్రీదేవి, శేషారత్నం, సంపంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అప్పన్న క్యాలెండర్ అమ్మకాల ప్రారంభం

సింహాద్రి అప్పన క్యాలెండర్ అమ్మకాలను దేవస్థానం అధికారులు ప్రారంభించారు. కొండపై సత్యనారాయణ స్వామి వ్రతం టికెట్ కౌంటర్, రూ.300 దర్శన టిక్కెట్ కౌంటర్, మే ఐ హెల్ప్‌యు కౌంటర్‌తోపాటు కొండదిగువన బస్‌స్టాండ్ వద్ద, గోపాలపట్నం, గోశాల పెట్రోల్ బంకుల వద్ద ఒక్కొక్కటి రూ.25కు క్యాలెండర్ అమ్మకాలను ప్రారంభించారు.

నేడు వికలాంగులకు ఉచిత బస్సు పాస్‌ల జారీ శిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వికలాంగులకు ఉచిత బస్, కన్సెషన్ రైల్వే పాస్‌ల జారీకి ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నారని వికలాంగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కోరాడ అప్పలస్వామినాయుడు, మండల అధ్యక్షులు కొత్తలంక దేవుడు తెలిపారు. పాస్‌ల కోసం సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు రెండేసి జిరాక్సులతోపాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలతో రావాలని సూచించారు. రైల్వే కన్సెషన్ పాస్ కోసం ఒరిజినల్ సదరం సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. శిబిరం నిర్వాహణకు భీమిలి కలిగొట్లస్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆర్థికసాయం అందిస్తున్నారన్నారు. మరిన్ని వివరాలకు కోరాడ అప్పలస్వామి నాయుడు. 98858 47239, కొత్తలంక దేముడు 9441349286 నెంబర్లకు సంప్రదించాలన్నారు

కుష్టువ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-పద్మనాభం : లెప్రసీ సొసైటీ ఆధ్వర్యంలో రేవిడి పిహెచ్‌సి పరిధిలోని ఆశాకార్యకర్తలకు కుష్టువ్యాధిపై పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో రేవిడితో గురువారం అవగాహన కల్పించారు. కుష్టువ్యాధితోపాటు టిబి, ఇతర వ్యాధుల లక్షణాలపై అవగాహన కల్పించి, అటువంటి లక్షణాలతో రోగులను గుర్తిస్తే వెంటనే ఆరోగ్యకేంద్రాలకు రిఫర్ చేయడం ద్వారావారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివారణ చర్యలు చేపట్టేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిపిఎంఒ జె.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి -ములగాడ: 61వ వార్డు ప్రియదర్శిని కాలనీలో ఇటీవల మరణించిన అద్దేపల్లి నాగేంద్రకు వైఎస్ఆర్ బీమా కింద తక్షణసాయంగా రూ.10వేలను నామినీకి ఆ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అందజేశారు. మిగిలిన బీమా పరిహారాన్ని నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కలిదిండి బద్రీనాథ్, చట్టి నూకరాజు, కొల్లు నూకరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్వర్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, స్థానికంగా ఉన్న ఐదు పేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసరాలను ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీరామచంద్రమూర్తి గురువారం అందజేశారు. మరో పేద మహిళకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు.కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట పాఠశాలలో విద్యార్థులకు జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ గురువారం ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నేతలు గాడు శ్రీను, జి ఎల్లయ్య, హెచ్‌ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు గొట్టిపల్లి సత్య నారాయణ, గౌరీశంకర శాస్త్రి, శేఖర్, నాగమణి పాల్గొన్నారు. లక్ష్మీపురం జెడ్‌పి హైస్కూల్‌లో వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, వైసిపి నేత గాడు తాతినాయుడు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఒకటో వార్డు, సంతపేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హైస్కూల్‌లో ట్యాబ్‌ల పంపిణీలో పిఏసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రాముునాయుడు, మాజీ కౌన్సిలర్ జివి.రమణ పాల్గొన్నారు.

ములగాడ: 61వ వార్డు ప్రకాష్‌నగర్ హైస్కూల్‌లో 250మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు కార్పొరేటర్ కొణతాల సుధ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ కలిదండి బద్రీనాథ్, ఇన్చార్జి దాడి సత్యనారాయణ, కొల్లు నూకరెడ్డి, చట్టి నూకరాజు, బుస అప్పలరెడ్డి, సోను, స్వప్న, పిలక వర, మంగ పాల్గొన్నారు.

సీతమ్మధార: 24వ వార్డు పిఅండ్‌టి కాలనీ, ఎన్ఎంసిహెచ్ జివిఎంసి హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి అత్యుత్తమ సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యను

ములగాడలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

అందించాలన్న సంకల్పంతో విద్యారంగంలో సిఎం జగన్ అనేక వినూత్న, విప్లవాత్మక కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ప్రభావతి పాల్గొన్నారు.

మధురవాడ : ఎండాడ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎనిమిదో వార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను, పథకాలను అందిపుచ్చుకుని సాంకేతికత, విజ్ఞానపరంగా విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అల్లాడ ఉమా మహేశ్వరరావు, గోపి, రాంబాబు, బుజ్జి, పాఠశాల హెచ్‌ఎం కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందపురం: తర్లువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక, సర్పంచ్ బాలి రాంబాబునాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.పద్మావతి వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, హెచ్‌ఎం, స్కూల్ కమిటీ ఛైర్మన్ బాలి రమణమ్మ పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

ఉద్దండపురంలో చోరీ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురంలో మీసేవ కేంద్రం, పాన్ షాప్ చోరీకి గురైంది. ఈ మేరకు మీసేవా కేంద్రం నిర్వాహకులు కోమర్తి గోవింద్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీ సేవా కేంద్రంలో వీడియో, ఫోటోగ్రఫీకి సంబంధించిన ఇంటర్నెట్ హార్డ్ డిస్కులు, ఇతర సామగ్రితోపాటు రూ.ఐదు వేలు నగదు అపహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాన్ షాప్‌లో కూడా సుమారు రూ.20 వేలు విలువ చేసే సరుకులను దొంగలు ఎత్తుకుపోయారు.

ఉద్యోగాల పేరిట మోసం.. ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పిఎం పాలెం సిఐ వై. రామకృష్ణ తెలిపారు. మధురవాడ ఐటీ కంపెనీ హిల్ నెంబర్-2లో సైబర్ ఫోక్స్ అనే ఐటి సంస్థను స్థాపించి, అందులో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి సుమారు 500 మంది దగ్గర డిపాజిట్లు కింద రూ.30 వేలు నుంచి 40 వేలు వరకు సేకరించారు. అనంతరం నెలలు గడుస్తున్నా జీతాలు ఇవ్వకపోవడంతో పాటు కట్టిన నగదు ఇవ్వాలని ఉద్యోగులు యాజమాన్యాన్ని నిలదీశారు. దాంతో యాజమాన్యం సంస్థను మూసివేశారు. బాధితుడు పి.సుధీర్ రాజు ఫిర్యాదు మేరకు కంపెనీ సిఇఒ, డైరెక్టరును అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.గురువారం ఉదయం గస్తీ తిరుగుతున్న పోలీసులకు పనోరమా హిల్స్ సమీపంలో అనుమానాస్పదరీతిలో సంచరిస్తున్న బోయపాలేనికి చెందిన బి.రాము, ఎండాడకు చెందిన ఎ.ప్రకాష్ పోలీసులను చూసి పరారవ్వడంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారించగా వారి నుంచి మూడు కిలోల గంజాయి పట్టుబడింది. రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. కేసును ఎస్ఐ విశ్వనాథ దర్యాప్తు చేశారన్నారు.

60వ వార్డులో ఎడిసి విస్తృత పర్యటన

ప్రజాశక్తి - ములగాడ : 60వ వార్డులో జివిఎంసి అదనపు కమిషనర్ (రెవెన్యూ, హెల్త్) డాక్టర్ వి.సన్యాసిరావు గురువారం విస్తృతంగా పర్యటించారు. స్థానిక కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ పివి.సురేష్‌తో గుల్లలపాలెం కాయగూరల దుకాణాలను తనిఖీ చేశారు. అక్కడ అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై విచారణ జరిపి, అవాస్తవమని నిర్ధారించారు. గుల్లలపాలెం ఎఫ్ఆర్‌యును సందర్శించారు. 30పడకలతో ఆసుపత్రి ఆధునీకరణకు పరిసర ఫ్యాక్టరీలు సిఎస్ఆర్ నిధులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నాయని కార్పొరేటర్ సురేష్ వివరించగా, దీనిపై కమిషనర్ దృష్టికి తీసుకె ళ్తానన్నారు. ఉడాకాలనీలో ఇండోర్ స్టేడియం, ఎమ్ఐజి క్వార్టర్స్‌లో పార్కులను పరిశీలించారు. స్థానిక నేత బంగార్రాజు పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి తగరపువలస : భీమిలి మండలం, టి నగరపాలెం ఎస్‌సి కాలనీలో రూ.10 లక్షల తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో నిర్మించనున్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, పంచాయితీ సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపిటిసి పల్లా నీలిమ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి, టిడిపి నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, మాజీసర్పంచ్ పొట్నూరు రాము, తమ్మిన వెంకటరమణపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోనిపాండ్రంగి, మద్ది, బాందేవపురం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పైర్లకు కత్తెర పురుగు ఆశించిందని, తక్షణమే తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి కె అప్పలస్వామి అన్నారు. గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించి, మొక్కజొన్న పైర్లను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు క్లోరాన్ ట్రిల్‌ప్రోల్ 0.3 మిల్లీమీటర్లు మందును లీటరు నీటిలో కలిపి, ఎకరానికి 35 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. వరి పొలాలను పరిశీలించారు. ఎఒ ఎవి.చలం ఉన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఉక్కు ప్రయివేటీకరణకు అడ్డుకట్ట

ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న సత్యవతి

ప్రజాశక్తి- గాజువాక : అవిశ్రాంత పోరాటం, త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు ఆపాలంటే ఐక్యపోరాటాలు అవసరమని ఐద్వానేతలు పిలుపునిచ్చారు. అఖిల భారత ఐద్వా మహాసభల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం గంగవరం గాంధీ బొమ్మ జంక్షన్, పెదగంట్యాడ హెచ్‌బి కాలనీ కూడలిలో ఐద్వా పతాకావిష్కరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై సత్యవతి మాట్లాడుతూ, ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంలో మహిళలు, నిర్వాసితులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా స్టీల్‌జోన్ కార్యదర్శి పి వేణు, ఐద్వా నేతలు వై సంధ్య, సిహెచ్ రేణుక, కె.లక్ష్మి పాల్గొన్నారు.

బజాజ్ 'పి150' పల్సర్ బైక్ ఆవిష్కరణ

బైక్‌ను ఆవిష్కరిస్తున్న సిఐ లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సర్వీస్ రోడ్డులోని సత్యం మోటార్స్, బజాజ్ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్, షోరూంలో మార్కెట్లోకి కొత్తగా వచ్చిన బజాజ్ పి150 పల్సర్ బైక్‌ను భీమిలి సిఐ కె లక్ష్మణమూర్తి గురువారం ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా షోరూం యాజమాన్య ప్రతినిధులు కొప్పల రమేష్, కృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బిఎ 6 మోడల్‌లో, అతి చిన్న సైలెన్సర్, సింగిల్ జోకర్, పొల్యూషన్ కంట్రోల్ సాంకేతికత, కారుకు మాదిరిగానే డిజిటల్ మీటర్ ఇతరత్రా ఫీచర్స్‌తో మార్కెట్లోకి వచ్చిన పల్సర్ పి150 మోటారు బైకు ఖరీదు రూ.1.38 లక్షలుగా ఉందన్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, ఒకటో వార్డు వైసిపి అధ్యక్షులు జగుపిళ్ల ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వర రావు, జివి రమణ, వైసిపి నేత తమ్మిన అశోక్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం

బ్యాడ్మింటన్ క్రీడాకారులతో కెల్ల సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ వెనుక భాగంలోని మైదానంలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ బ్యాడ్మింటన్ టోర్నీని వైసిపి వార్డు అధ్యక్షుడు కెల్ల సత్యనారాయణ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. వార్డు వైసిపి నేతలు పిల్లి వీర్రాజు, వెంకటరెడ్డి, పోలారావు, పాండ్రంకి శ్రీను, బేతా దుర్గారావు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యాన ఆటల పోటీలు

ప్రజాశక్తి -ఆనందపురం: నెహ్రూ యువకేంద్ర సంఘటన్, భీమిలి బ్లాక్ ఆధ్వర్యంలో పొడుగుపాలెంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను ఎంపిటిసి బంటుబిల్లి అప్పలస్వామి ప్రారంభించారు. జాతీయ యువ వాలంటీర్ లొడగల అచ్చి బాబు, తగురోతు శంకర్, బంటుపల్లి శంకర్, బంగారరాజు, తారకేశ్, శివ, వంశీ, జగదీష్, కేశవ, వెంకటేష్ పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు కార్మికుల సన్నద్ధత

సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు

ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా

మహాసభల వేదికగా కేంద్రానికి హెచ్చరిక

కార్మికుల చైతన్యానికే రాష్ట్రవ్యాప్తంగా జీపుజాతాలు

స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద రిలే దీక్షల శిబిరంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రభుత్వ విధానాలతో కార్మిక వర్గానికి జరుగుతున్న అన్యాయాలను వివరించి, వారిని సమరశీల పోరాటాలకు సన్నద్ధమయ్యేలా చైతన్యపరచడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కార్మిక చైతన్యయాత్ర జీపుజాతాలను నిర్వహిస్తున్నామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు అన్నారు. జనవరి 2 నుంచి 4 వరకు భీమవరంలో సిఐటియు 16వ రాష్ట్రమహాసభల నేపథ్యంలో సిహెచ్.నర్సింగరావు నేతృత్వం వహిస్తున్న జీపుజాతా గురువారం కూర్మన్నపాలెం వచ్చిన సందర్భంగా ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేక రిలే దీక్షల శిబిరం వద్ద మాట్లాడుతూ, రాష్ట్రమహాసభల వేదికగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రానికి హెచ్చరిక పంపిస్తామన్నారు. కేంద్రం విధానాలను సమర్థిస్తూ, రాష్ట్రంలో కార్మిక వ్యతరేక సంస్కరణలను వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్మికులను కనీసం ప్రశ్నించలేని విధంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సభలో ముఖ్య వక్తగా పాల్గొన్న రాష్ట్ర సిఐటియు ఉపాధ్యక్షురాలు బేబీ రాణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల సిఐటియు మహాసభల్లోనూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికవర్గం పెద్ద ఎత్తున ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నారని, ఆ దిశగా పోరాటాలపై అవగాహన పెంచుకొని సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కార్మిక, ప్రజాసంఘాల విశాఖ నగర జెఎసి కన్వీనర్ ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ రానున్న నూతన సంవత్సరం, భోగి, సంక్రాంతిలతోపాటు గ్రామ దేవత పండగల్లో ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలను కలుపుకునే విధంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వైటి దాస్, విళ్ళ రామ్మోహన్ కుమార్, డివి రమణారెడ్డి, సిహెచ్ సన్యాసిరావు, పరంధామయ్య, డేవిడ్, దాలినాయుడు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర సిఐటియు మహాసభలు దిగ్విజయంగా జరగాలని, దీనిలో కార్మిక వ్యతిరేక విధానాలపై మరింత సమరశీల పోరాటాలు రూపకల్పన జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెఎం శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి కుమార్, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కుమార మంగళం స్టీల్ సిఐటియు ప్రధానకార్యదర్శి యు రామస్వామి, నాయకులు జె అయోధ్యరామ్, పి శ్రీనివాసరాజు, ఎన్ రామారావు, ఒవి రావు, స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు నీరుకొండ రామచంద్రరావు, జె రామకృష్ణ, స్టీల్ సిఐటియు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కార్మిక చైతన్య యాత్రకు అపూర్వ స్వాగతం

కార్మిక చైతన్యయాత్రను స్వాగతిస్తున్న భీమిలి సిఐటియు నేతలు

గాజువాకలో కార్మిక చైతన్యయాత్ర ర్యాలీ

ప్రజాశక్తి -తగరపువలస : పశ్చిమగోదావరి జిల్లా, భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని చేపడుతున్న కార్మిక చైతన్యయాత్రకు తగరపువలస హైవేలో వెంకటేశ్వర మెట్ట వద్ద యూనియన్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు మోటారు బైక్‌ర్యాలీగా వెళ్లి ఘనస్వాగతం పలికారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన ఈ యాత్ర ,విజయనగరం మీదుగా విశాఖ జిల్లాలో అడుగుపెట్టింది. కార్మిక చైతన్యయాత్రలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సిఐటియు కార్యదర్శులు అమ్మినాయుడు, సురేష్ పాల్గొన్నారు. యాత్రకు స్వాగతం పలికిన వారిలో యూనియన్ భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, సహాయ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు, నాయకులు నీలాతి రాము, మూర్తి, రీసు నరసింగరావు, కొత్తయ్య రెడ్డి ఉన్నారు.

గాజువాక : సిఐటియు రాష్ట్ర మహాసభల నేపథ్యంలో నిర్వహిస్తున్న కార్మిక చైతన్యయాత్ర గాజువాక చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం రాంబాబు, జోన్ కార్యదర్శి ఎ.లోకేష్ గొలగాన అప్పారావు, సురేష్ ఇతర కార్మికుల ఘనస్వాగతం పలికారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికలోకం కదలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జి నాయుడు, రాజు, గోవిందు పాల్గొన్నారు

ఆరిలోవ : సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ తలపెట్టిన కార్మిక చైతన్య యాత్రకు జాతీయ రహదారి పాత డెయిరీఫారం కూడలి వద్ద విశాఖ సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి కారులు, ఆటోలు, బైకులతో కార్మికదండు భారీర్యాలీగా హనుమంతువాక, ఇసుకతోట, మద్దిల పాలెం మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు వెళ్ళారు. సిఐటియు జిల్లా జనరల్ సెక్రటరీ ఆర్.కె.ఎస్.వి.కుమార్, జిల్లా సెక్రటరీ జగన్, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేటర్ కన్వీనర్ కుమార్ మంగళం, మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ సెక్రటరీ జి.అప్పలరాజు, ఆటో యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.వెంకట్రావు, క్యాబ్ యూనియన్ సెక్రటరీ శ్రీరాములు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ యు.రాజు, ఎలక్ట్రికల్ మీటర్స్ యూనియన్ నాయకులు రామక్రిష్ణ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ఆరిలోవలో కార్మిక చైతన్యయాత్ర

ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించండి

ఎంపీ ఎంవీవీకి వినతిపత్రం అందిస్తున్న సత్యారావు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని ఉక్కు నిర్వాసితుల సంఘం కన్వీనర్ గొందేసి సత్యారావు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీ ఎంవీవి సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులకు రూ.30వేలు నెలసరి వేతనం వచ్చేలా ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటానికి కలిసి రావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్, నిర్వాసితుల సమస్యలపై కేంద్రమంత్రులను కలిసే అవకాశం కల్పించాలని సత్యారావు విన్నవించారు.

దీనిపై ఎంపీ ఎంవివి స్పందిస్తూ, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, నిర్వాసితుల సమస్యలపై సభ దృష్టికి తీసుకెళతానన్నారు. కేంద్రమంత్రులను కలిసేందుకు నిర్వాసితుల బృందానికి అవకాశం కల్పిస్తానని హామీనిచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పిట్టరెడ్డి, గుండేసు ప్రభాకరరెడ్డి, రాము పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. గురువారం 26వ వార్డులో వైసిపి వార్డు అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ సమస్యలేవైనా ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బొడ్డేటి కిరణ్‌కుమార్, పొతు సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి బోరు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రజని

ప్రజాశక్తి-కంచరపాలెం : జివిఎంసి 54వ వార్డు ఐటిఐ జంక్షన్‌లోని గజపతినగరంలో తాగునీటి బోరు నిర్మాణానికి స్థానిక వార్డు కార్పొరేటర్ చల్ల రజని ఈశ్వరరావు, గ్రామ అధ్యక్షులు రాధాకృష్ణారెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రజని మాట్లాడుతూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

మూడున్నరేళ్లయినా జరగని న్యాయం

నేడు సిఎం జగన్‌ను కలిసేందుకు సిద్ధమవుతున్న రోడ్డు విస్తరణ బాధితులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మెయిన్ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు మూడున్నరేళ్లయినా న్యాయం జరగలేదు. దీంతో వీరంతా శుక్రవారం నర్సీపట్నం వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. 2018లో టిడిపి ప్రభుత్వ హయాంలో బుచ్చయ్యపేట మెయిన్ రోడ్డు విస్తరణకు నాటి శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు, స్థానిక నాయకులు కలిసి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకున్నారు. ఇళ్లు కోల్పోయే బాధితులకు ప్రభుత్వం నుండి ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రోడ్డు వెడల్పు చేయడానికి రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లను ఆ ఇళ్ల యజమానుల అంగీకరించడంతో తొలగించారు. ఈ విధంగా సుమారు 25 మంది ఇళ్లు పూర్తిగాను, మరో 25 మంది ఇళ్లు పాక్షికంగాను కోల్పోయారు. ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్లను మంజూరు చేయడానికి నాడు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ఈ లోగా 2019 సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో ఇళ్ల మంజూరు నిలిచిపోయింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా ఉన్న ప్రస్తుత శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ తాను విజయం సాధిస్తే బాధితులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన గెలిచారు. ఆయన పార్టీ అధికారంలోకి వచ్చింది. కాని నేటికీ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు మంజూరు చేయలేదు. మూడున్నరేళ్లకావస్తున్న సహాయం ఏమీ అందలేదని బాధితులు వాపోతున్నారు. దీంతో శుక్రవారం ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యను విన్నవించనున్నట్లు బాధితులు పేలూరి నారాయణమ్మ, పాతాళ అప్పారావు, మొక్క జల్లమ్మ, పాతాళ రాము తదితరులు తెలిపారు.

రోడ్డు విస్తరణలో కూల్చిన ఇళ్ల వద్ద బాధితులు

ఆందోళన చేస్తున్న ఎన్ఎఒబి నిర్వాసితులు

నేవీ నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-రాంబిల్లి

ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం తగదని నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మండిపడ్డారు. తమ సమస్యలపై ఎనిమిది గ్రామాలకు చెందిన నేవీ నిర్వాసితులు వాడనర్సాపురం సమీపంలోని ఎన్ఎఒబి గేటు ముందు చేపట్టిన ఆందోళన గురువారం నాటికి 60వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో అధికారులు ఇచ్చిన హామీలను, తమతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలలుగా వేటకు వెళ్లే అవకాశం లేక, ఉపాధి లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి జెట్టీని నిర్మించాలని, అంత వరకు నేవీ గేట్లు తెరిచి శారదా నది గుండా వేటకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పట్టించుకోకుంటే పెద్ద ఎత్తు అనకాపల్లి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు

లారస్ ఘటనలో గోప్యతపై చర్యలకు సిపిఐ ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి

మొన్న లారస్ ఫార్మా, గతంలో బ్రాండిక్స్ వరుస ప్రమాదాల ఘటనల విషయంలో గోప్యత పాటిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం సిపిఐ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ లారస్‌లో జరిగిన ప్రమాదంలో నలుగురు మరణిస్తే ఆ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియకుండా ఎందుకు దాచి పెట్టారని ప్రశ్నించారు. ఇందుకు బాధ్యులైన కంపెనీ అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్య లోపాల కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నాయకులు ఆర్.దొరబాబు, రామునాయుడు, సన్యాసిరావు, వైఎన్.భద్రం, చెల్లూరి నాగరాజు, కోన లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

'దళితుల సమరభేరి'కి తరలిరండి

ప్రజాశక్తి-వడ్డాది

దళితుల సమరభేరి ర్యాలీకి సంబంధించిన కర పత్రాన్ని వడ్డాదిలోని టిడిపి కార్యాలయంలో టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎలక మల్లిబాబు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ సమరభేరి ర్యాలీకి నియోజకవర్గంలోని దళితులందరూ రావాలని పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వంలో దళితులపై అత్యాచారాలు, హింస పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సిరిగిరి శెట్టి శ్రీరామ్మూర్తి, చోడవరం ఎంపిటీసీ కొట్టుపు చిన్న పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నియోజకవర్గం ఇన్‌ఛార్జి తాతయ్యబాబు

బూడిద ఆధారిత నిర్మాణ ఉత్పత్తులపై సమ్మేళనం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సింహాద్రి సిజిఎం చౌక్

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ ఎన్టీపీసీ సింహాద్రి కొత్తగా అభివృద్ధి చేసిన బూడిద ఆధారిత నిర్మాణ ఉత్పత్తులపై చర్చించడానికి, తెలుసుకోవడానికి వాటాదారుల కోసం కస్టమర్ సమ్మేళనాన్ని గురువారం నిర్వహించారు. దీనిని సింహాద్రి చీఫ్ జనరల్ మేనేజర్ జిసి.చౌక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టిపిసి ఫ్లైయాష్‌తో బూడిద సంబంధిత నిర్మాణ ఉత్పత్తులైన నానో కాంక్రీట్ కంకర, సహజ రాయి కంకర, జియో పాలిమర్ ముతక కంకర, యాష్ టు సాండ్, లైట్ వెయిట్ అగ్రిగేట్ వంటివి ఎన్‌టిపిసి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. నానో కాంక్రీట్ కంకరపై విశాఖలోని ఈన్ సావర్ప్ ల్యాబ్స్ డైరెక్టర్ ఎన్.కాళిదాస్ టెక్నికల్ సెషన్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా బూడిదతో తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి జనరల్ మేనేజర్ (ఓ అండ్ ఎం) ఎస్‌కె సిన్హా, యాష్ వినియోగదారులతో పాటు కళాశాలల నుండి అధ్యాపకులు, ఎన్‌టిపిసి అధికారులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని వెదురువాడ గ్రామంలో గురువారం జల్ జీవన్ మిషన్ పనులను గ్రామ సర్పంచ్ కొయ్యా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ పుర్రె వరలక్ష్మి, ఉపసర్పంచ్ సిహెచ్ సత్యనారాయణ రాజు, కొయ్య మహాలక్ష్మి, కె.శ్రీను, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ ఫెయిర్‌లో డైట్‌కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి

కాకినాడ జెఎన్‌టియులో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ ఫెయిర్లో అనకాపల్లి డైట్ కళాశాలకు ప్రథమ స్థానం లభించింది. కాకినాడ జెఎన్‌టియు, భారత ప్రభుత్వ నేషనల్ ఇనిషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్ మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ ఫెయిర్‌లో రాష్ట్ర నలుమూలల ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు 174 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో డైట్ సివిల్ విద్యార్థులు ప్రదర్శించిన పర్యావరణ అనుకూల అపారదర్శక సిమెంట్ మొరాటర్ ఇటుక ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రూ.20 వేలు నగదు బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సిహెచ్ జగదీష్, ఆడారి భార్గవ్‌ను, ప్రాజెక్ట్ మెంటర్‌గా వ్యవహరించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మద్ది గంగాధర్ గుప్తాను డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం మాట్లాడుతూ మూడేళ్లుగా ఇటువంటి ప్రాజెక్టులను తమ విద్యార్థులు ప్రదర్శించి ఉత్తమ స్థానాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, సివిల్ విభాగాధిపతి ఎన్.రాము తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ రత్నాకర్

కొనసాగిన మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి : హెటిరో పైప్ లైన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన శాంతియుత మహా ధర్నా గురువారం నాటికి 393వ రోజుకు చేరింది. మత్స్యకారుల జీవన విధానానికి నష్టం చేకూర్చే పైప్‌లైన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా 393 రోజుల నుండి ఆందోళన చేస్తున్నప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణ మన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చినతీనార్ల జనసేన పార్టీ యూత్ లీడర్ కందాల నాగరాజు, పార్టీ ప్రెసిడెంట్ పిక్కి మహేష్, రాజయ్యపేటకు చెందిన మత్స్యకారులు మైలపల్లి బాబ్జి, కాశీరావు, మైలపల్లి జాను, పిక్కి రాజు, మైలపల్లి శివాజీ, కారే సతీష్, చౌడేపల్లి రాజు పాల్గొన్నారు.

అర్హులైన వారికి మరో అవకాశం

డిప్యూటీ సీఎం బూడి

ప్రజాశక్తి - దేవరాపల్లి : అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందలేదని, బియ్యం కార్డులు, ఇళ్ల పట్టాల లాంటివి రాలేదని ఎవరు ఆందోళన చెందనక్కరలేదని, వారికి మరో అవకాశం ప్రభుత్వం ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి ఏటా జూన్, డిసెంబర్ నెలల్లో మరో అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న 2.79 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాకు సుమారు రూ.591 కోట్లు ప్రభుత్వం జమ చేసిందన్నారు.

1న సైనిక స్కూల్ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-వడ్డాది : జనవరి ఒకటి ఆదివారం ఉదయం వడ్డాదిలో సైనిక్ స్కూల్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పిఎంఎస్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ పి.రమణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించే పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు ఈ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రవేశ పరీక్ష జనవరి 8న జరగనుందని, దీనికి ముందస్తుగా తాము ఈ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9966690620 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ప్రసాద్‌తో కలిసి పని చేస్తా

ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి సిఎంగా చేయడానికి రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి పని చేస్తానని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. తమ ఇద్దరి మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. అచ్యుతాపురంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన బహిరంగంగా ఈ విషయం చెప్పారు. ప్రసాదు అనుచరులతో స్వయంగా తానే ఫోన్ చేసి మాట్లాడి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుస్తానని చెప్పారు. బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యేకు తనకు మధ్య ఎవరూ కుంపటి పెట్టొద్దన్నారు. తప్పుడు మాటలు ఆలకించి ఎవరూ వ్యక్తిగతమైన తప్పుడు ప్రచారాలకు పాల్పడరాదని హితవుపలికారు. నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరవేయడమే తన లక్ష్యమని చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని పొట్టిదొరపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై బుచ్చయ్యపేట ఎస్ఐ కుమారస్వామి తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ముందుగా వచ్చిన సమాచారంతో ఈ దాడి చేసి 8 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.66,010 నగదు, 52 పేక ముక్కలును స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాణ్యత ప్రమాణాల ఆధారంగానే ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- అనకాపల్లి : భారత ప్రభుత్వం నిర్దేశించిన ఐదు నాణ్యత ప్రమాణాల ఆధారంగానే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రంగాచారి తెలిపారు. మండలంలోని తుమ్మపాల రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు గురువారం ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలకు లోబడే విధంగా మెరుగుపరచాలన్నారు. తమ సాంకేతిక సిబ్బంది ధాన్యం నాణ్యతను పరిశీలిస్తారని చెప్పారు. రైతు నుంచి కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ముతో పాటు గోనె సంచులు, హమాలీలను ఏర్పాటు చేసుకుంటే ఆ మొత్తాన్ని రైతుల ఖాతాల్లోకి 21 రోజుల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు మనీషా పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయ అధికారిగా ఓ.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి కెవి.లక్ష్మణరావు నుంచి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావుగతంలో ఇక్కడ పని చేశారు. తరువాత అల్లిపురం, ముంచింగిపుట్టులో పని చేసి బదిలీపై మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఇక్కడికి వచ్చారు. ఈయన రాక పట్ల స్థానిక పాఠకులు హర్షం వ్యక్తం చేశారు.

దట్టంగా మంచు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో పొగమంచు దట్టంగా కురవడంతో ఆయా వర్గాల ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా వాహనదారులు, విద్యార్థులు, మార్నింగ్ వాకర్స్ అవస్థలు పడ్డారు. ఉదయం 9 గంటలు అయినా మంచు కురుస్తూనే ఉంది.

బోసిపోయిన కార్యాలయాలు

ప్రజాశక్తి-కోటవురట్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 30న శుక్రవారం నర్సీపట్నం పర్యటన సందర్భంగా మండలంలోని తహశీల్దారు, మండల పరిషత్ కార్యాలయాలు బోసిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ కార్యాలయాలు సిఎం పర్యటన సందర్భంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ముఖ్యమంత్రి పర్యటన రెండు రోజులు వాయిదా పడింది .వివిధ పనుల పై కార్యాలయాలకు వచ్చే ప్రజలు సామాజిక పింఛన్ల తొలగింపు లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేరు.

అధికారులు లేక బోసిపోయిన తహశీల్దారు కార్యాలయం

కన్వీనర్లు, వాలంటీర్లు సమిష్టిగా పని చేయాలి

డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - దేవరాపల్లి

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం నేరుగా ప్రజలకు తెలిసే విధంగా సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సమిష్టిగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద గురువారం మండల వాలంటీర్ల సమీక్ష సమావేశం జరిగింది. మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బూడి మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఆలోచన విధానంలో భాగంగా కలిసిమెలిసి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, వాలంటీర్లు అలసత్వం వహిస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు ఉరుకూటి అప్పారావు, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, జడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, ఎంపిడిఓ సిహెచ్ సుబ్బలక్ష్మి, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులకు అందుతున్న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ వైసిపి బలోపేతానికి కృషి చేయాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. నూతనంగా నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ముఖ్య నాయకులతో సమావేశం శుక్రవారం బుచ్చయ్యపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాకవరపు నాగేశ్వరావు దేవి నాగరాజు, జెడ్పిటిసి దొండా రాంబాబు, వైస్ ఎంపిపి దొండా నారాయణమూర్తి, సర్పంచ్ మరిసానాని, ఎంపిటిసి దేవర అప్పారావు యాదవ్, వైసిపి నాయకులు కొల్లిమల్ల అచ్చం నాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : వాలంటీర్ల సేవలు అమోఘమని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. అచ్యుతాపురం మండల సముదాయం గ్రౌండ్లో వార్డు వాలంటీర్లు, గ్రామ సచివాలయాల సిబ్బంది, నూతనంగా నియమిస్తున్న కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో వాలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, ఎంపిపి కోన సంధ్య, జడ్పిటిసి సభ్యులు లాలం రాంబాబు, పార్టీ నాయకులు దేశం శెట్టి శంకర్రావు, నర్మల కుమార్, కోన బుజ్జి పాల్గొన్నారు.

'కందుకూరు' మృతులకు నివాళి

మృతులకు నివాళులర్పిస్తున్న నాగజగదీష్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

నెల్లూరు జిల్లా కందుకూరులో బుధవారం టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు సభ సందర్భంగా తొక్కిసిలాటలో మృతి చెందిన ఎనిమిది మందికి గురువారం టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల అనుమతితోనే తమ నాయకులు బహిరంగ సభలు నిర్వహిస్తున్నారని, బందోబస్తు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జగన్ రెడ్డి హయాంలో 173 మంది వివిధ సంఘటనలో చనిపోయారని, దీనికి ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరే సతీష్, కుప్పిలి జగన్మోహన్‌రావు, మారిశెట్టి శంకర్రావు, బుద్ధ భువనేశ్వరరావు, విల్లూరి సత్యనారాయణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

కందుకూరు ఘటన టిడిపికి బ్లాక్ డే

కందుకూరు ప్రమాద ఘటన టిడిపికి ఒక బ్లాక్ డే అని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మృతి చెందిన కార్యకర్తలకు కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, పోలవరపు త్రినాథ్, ఎంపిటిసి సభ్యుడు తోటాడ విజయ్, ధనాల విష్ణు చౌదరి, తలారి కాశీనాయుడు, మేడిశెట్టి నూకరాజు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

వడ్డాది : కందుకూరు సభలో మృతి చెందిన టిడిపి కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది టిడిపి కార్యాలయంలో మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో లోపూడి ఎంపిటిసి యల్లపు జగ్గారావు, టిడిపి నాయకులు శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పింఛన్లు నిలిపివేయడం అన్యాయం

ప్రజాశక్తి- దేవరాపల్లి

ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్లు పొందుతున్న పేద, మధ్యతరగతి వృద్ధుల పింఛన్లు నిలిపివేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలోని ఎన్.గజపతినగరంలో టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఇదేమి కర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముందు మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువతకు ఉద్యోగ కల్పన, రైతుకు గిట్టుబాటు ధర, మహిళలకు రక్షణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శెరకాన సూర్యనారాయణ, పూడి సత్యారావు, సోమిరెడ్డి గోవింద, పోతల రమణ, పాశల కృష్ణ, బండారు శ్రీరామ్మూర్తి, మలిరెడ్డి రాజునాయుడు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాకలో చేపట్టిన ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం నాటికి ఏడవ రోజుకు చేరింది. మెయిన్ రోడ్‌లో స్థానిక టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి అధికార వైసిపి పాలన ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి శివ, దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, డొక్కా నాగభూషణం, విల్లూరు నూక నరసింహారావు, కోరుకొండ ప్రసాద్, ఆడారి గోవిందా, బొడ్డేడ ప్రసాద్, బేల లక్ష్మణరావు, ఆడారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని మహిళకు ఇస్తున్న మంత్రి అమర్‌నాథ్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కశింకోట

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ అన్నారు. మండలంలోని తీడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, వైస్ ఎంపిపి నమ్మి మీనా, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, నరిశింగబిల్లి పిఎసిఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి గండి నాయుడు బాబు, పెంటకోట శ్రీనివాసరావు, ఎమ్‌పిడిఓ కొంకి అప్పారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని గ్రామాలకు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.52 లక్షలతో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి అనూరాధ, ఎంపిపి రెడ్డి జగన్ మోహన్, మండల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలో మడుతూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వం పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు రాంబాబు, సర్పంచ్ మోటూరు సంజీవ్, ఎంపిటిసి శనివాడ జువాల నాయుడు, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, కె విమలా నాయుడు, లాలం శ్రీనివాస్, సియాద్రి బుజ్జి, పి వాసు, బలిరెడ్డి శ్రీనివాసరావు, కోన బుజ్జి పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని రెండో రోజూ ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : తొలగించిన వికలాంగుల పింఛన్లను ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రెండో రోజు కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పాతరపల్లి వీరు యాదవ్ మాట్లాడుతూ మానవత్వం లేకుండా తొలగించిన సామాజిక భద్రత, వికలాంగుల పింఛన్లను రాష్ట్రవ్యాప్తంగా నాలుగు నుంచి ఆరు లక్షల వరకు నిలుపుదల చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.3 వేలు పింఛన్లనే వైసిపి ప్రభుత్వం కూడా ఇస్తుందని, అదనంగా ఒక రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా నాయకులు మెరుగు నూకరాజు, కాండ్రేగుల నూక అప్పారావు, ఆడారి తులసి, సంతోష్ అప్పలనాయుడు, కరెడ్ల కోటేశ్వరరావు, కంబాల అప్పలరాజు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గొర్లివానిపాలెం రూ.7 లక్షలతో సిసి డ్రైనేజీ నిర్మాణ పనులను ఆ గ్రామ సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల నిధుల నుంచి ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రామాలయం నుంచి తురక మధుము గెడ్డ వరకు ఈ పనులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గొర్లె వరలక్ష్మి ఏరుకునాయుడు, ఉప సర్పంచ్ గొర్లి రామారావు, వార్డు సభ్యులు పైల మాధురి, పోలిరెడ్డి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ గోపి అమ్మలు

కేంద్రం అనుమతులు ఇవ్వకుండా ..

మెడికల్ కళాశాలల ఏర్పాటు ఎలా?

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:కేంద్రం అనుమతులు ఇవ్వకుండా మెడికల్ కళాశాల నిర్మాణాలు ఎలా చేస్తారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడు ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణం చేయడం సంతోషకరమన్నారు. వాస్తవాలను చెప్పకుండా ప్రజలను మభ్యపెట్టి ఓట్ల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మెడికల్ కళాశాలకు తాము వ్యతిరేకం కాదని, మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల కోసం స్థలాలు ఇవ్వాలని రైతులకు సూచించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ 16 మెడికల్ కళాశాలలను మంజూరు చేస్తున్నానని, దానికి 8వేల కోట్లు ఖర్చు అవుతుందని ప్రకటించడం జరిగిందన్నారు. ఇందులో పాడేరు, పులివెందులలో మెడికల్ కళాశాలలకు 2020 అక్టోబర్ 20న శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ కళాశాలలు శంకుస్థాపన చేసి రెండున్నర ఏళ్ళ గడు స్తున్నా ఇప్పటికీ నిర్మాణాలు జరగలేదని చెప్పారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 16 మెడికల్ కళాశాలను మంజూరు చేసినట్లు ప్రకటించి శంకుస్థాపన చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి అనుమతి కోసం లేఖ రాయడం జరిగిందన్నారు. ఈ లేఖలో ఏడు కళాశాలలు మాత్రమే కావాలని రాయడంలో మర్మం ఏమిటని ప్రశ్నించారు. ఏడు కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం మూడు కళాశాలలకే అనుమతి ఇచ్చిందని, అందులో పిడుగురాళ్ల, పాడేరు, మచిలిపట్నం దానికే అనుమతులు లభించాయన్నారు.

కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా 16 కళాశాలలకు ఎలా శంకుస్థాపన చేస్తారని ప్రశ్నించారు. దీనిపై నర్సీపట్నం వస్తున్న ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలన్నారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎంపిపి

సిఎం పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రోలుగుంట:ఈ నెల 30న శుక్రవారం నర్సీపట్నంలో జరిగే సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. గురు వారం ఎంపిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్ పర్యటన విజయవంతం అయ్యేందుకు ప్రతీ సచివాలయ పరిధిలోని పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా విఒఎలు కృషి చేయాలని కోరారు.

గొలుగొండ:ఈ నెల 30న నర్సీపట్నంలో ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలం నుంచి 115 వాహనాల్లో 7500 మంది తరలి వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నమూనాలతో సాంకేతిక నైపుణ్యం

ప్రజాశక్తి-మాకవరపాలెం:సాంకేతిక సమూనాల ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సాంకేతిక నైపుణ్యాన్ని వెలికి తీయగలమని అవంతి కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. స్థానిక అవంతి కాలేజీలో స్పచన 2022 పేరుతో సాంకేతిక నమూనాల ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెమికల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో లాజికల్ రీజనింగ్, అర్థమెటికల్‌లో ప్రావీణ్యం సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి హార్డ్ వర్క్ చేయడంతో ఉత్తమ ఫలితాలు తక్కువ సమయంలో సాధించవచ్చన్నారు. ఈ కార్య క్రమంలో 40 మంది విద్యార్థులు సాంకేతిక నమూ నాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అవంతి కాలేజీ ఏఈఓ దానియేల్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం హంస వాహనంపై శ్రీనివాసుడు, గోదాదేవి అమ్మవారు పల్లకిలోనూ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, భాగవతం గోపాల ఆచార్యులు, పీసపాటి వేంకట శేషాచార్యులు, నండూరి వేంకట రాజగోపాలాచార్యులు, దేవస్థానం సిబ్బంది సందీప్, నవీన్, గురవయ్య, టిటిడి విజిలెన్స్ సిబ్బంది కుమార్, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

పేదలకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్(బికాం) ఆధ్వర్యంలో గురువారం గుప్పెడు బియ్యం. పథకం కింద బలిఘట్టం కొండ ప్రాంతంలోని పేద ప్రజలకు ఒక్కో కుటుంబానికి 10 కేజీల చొప్పున 780 కేజీల బి య్యం పంపిణీ చేశారు. చిన్న పిల్లలకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్.కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఇటువంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ టి.నానాజీ, వి.రమేష్, టి.లోవరాజు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 28న విశాఖపట్నం ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ అండర్ 14 సెలక్షన్‌ల్లో గొలుగొండ మండలం చోద్యం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు డి.జేమ్స్, సిహెచ్.శ్రీను ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం జి.రత్నాజి, పిఇటిలు నర్సింగరావు, కుండూరు నూకరాజులు తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ట్యాబులను ఇస్తున్న జెడ్‌పిటిసి రమణమ్మ

ప్రజాశక్తి-కొత్తకోట:విద్యా ప్రమాణాలు మెరుగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రావికమతం జెడ్పిటిసి, విశాఖ ఉమ్మడి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటి చైర్‌పర్సన్ తలారి రమణమ్మ అన్నారు. గురువారం మండలంలో కొత్తకోట, జెడ్.కొత్తపట్నం, టి. అర్జాపురం, దొండపూడి గ్రామాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న సాంకేతిక విద్యా ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో దేశంలోనే ప్రథమ స్థానం సాధించిందని, ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలోనూ సాంకేతిక విద్యను అందిం చేందుకు ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ్, వైస్ ఎంపీపీ ఎం.భవానీ ప్రసాద్, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపీటీసీలు పూడి దేవా, కుంచా శంకర్, మాజీ ఉప సర్పంచ్ కె.గున్నాజీ, హెచ్ఎం డి.సత్యారావు, నాయుడు, సిఆర్‌పి జి.రామారావు పాల్గొన్నారు.



రావికమతంలో...

రావికమతం:కవగుంట ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు టాబ్లను సర్పంచ్ దాసరి సూర్యకుమార్ వరహాలు, చైర్మన్ ప్రగడ నాయుడుబాబు, వైస్ చైర్మన్ పి పైడితల్లమ్మ, హెచ్ఎం రఘురాం చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ కే.రాజేశ్వరి జానకి, లక్ష్మి, శంకర్రావు, వరహాలు, నాయుడు పాల్గొన్నారు

అనకాపల్లి:మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పిడి గాంధీ, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి శేఖర్, ఎంపీటీసీ పంచదారల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం కెఎస్ మూర్తి ఆధ్వర్యాన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు బైజూస్ యాప్‌తో కూడిన సాంసంగ్ ట్యూబ్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, ఎంపిటీసి అర్జిల్లి దేవిరవి, వైసిపి నాయకులు బొంది అచ్చిబాబు, సూరాడ మసేను, ముత్యాలరావు, స్కూల్ చైర్మన్ శివ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకే ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేస్తుందని జెడ్పిటిసి దొండా రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్‌లో 58 మంది విద్యార్థులకు బైజుస్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వైసిపి మండల అధ్యక్షుడు అచ్చంనాయుడు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, వైసీపీ నేత నారాయణమూర్తి పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలనే సంకల్పంతో ట్యాబులు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లి జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు 29 ట్యాబులను పంపిణీ చేశారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్డి పి.ఈశ్వరరావు, పాఠశాల హెచ్ఎం బి రతన్ రాజు, ఎంపీటీసీ శరగడం అప్పల నరసమ్మ స్కూల్ కమిటీ చైర్మన్ ఎల్లపు గోవిందరావు, వైస్ చైర్మన్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సబ్బవరం : విద్యా రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ బోకం సూర్య కుమారి రామునాయుడు, జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీలు శరగడం ఝాన్సీ లక్ష్మీ రాణి, చొక్కాకుల గోవింద్, ఎంపీటీసీలు బైలపూడి దేముడుబాబు, సబ్బవరపు నారాయణమూర్తి, శరగడం రాము, వైసిపి నాయకులు కర్రి బాబు, ఎంపీడీఓ రమేష్ నాయుడు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, ఎంఈఓ ఎస్. అప్పలరాజు, హెచ్ఎం చిన్నమ్మాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గోపాలమిత్రలు

సమస్యలపై గోపాలమిత్రల వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2500 మంది గోపాల మిత్రుల సమస్యలను పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు స్థానిక గోపాల మిత్రుల వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోపాల మిత్రలు మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా పశుసంవర్ధక శాఖకు అనుబంధంగా పని చేస్తూ నిరంతరం పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పలు సేవలను అందిస్తున్నామన్నారు. గత పాదయాత్రలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి గోపాల మిత్రులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని నర్సీపట్నం రానున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో గోలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, గోపాల మిత్రులు రామకృష్ణ, శ్రీనివాసరావు, గంగరాజు, నానాజీ పాల్గొన్నారు.

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

▶▶ సభా ప్రాంగణం సిద్ధం ▶▶ పరిశీలించిన మంత్రి అమర్, ఎంపి, కలెక్టర్, ▶▶ కాన్వాయ్ ట్రయిల్ రన్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఈనెల 30న శుక్రవారం నర్సీపట్నం వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి ఎంపీ బీసెట్టి సత్యవతి, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల కోఆర్డినేటర్ రఘురాం, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, కలెక్టర్ రవి పటాన్ శెట్టి, ఎస్పీ గౌతమిశాలి తదితరులు పరిశీలించారు. నర్సీపట్నంలోని జోగినాధుని పాలెంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి సభా ప్రాంగణాన్ని, బలిఘట్టం బైపాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ ను వీరు సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులకు మంత్రి అమర్నాథ్ సూచనలు ఇచ్చారు.

సిఎం సభావేదిక

కాన్వాయ్ ట్రయిల్ రన్

సీఎం కాన్వాయ్ ట్రయిల్ రన్ విశాఖ రేంజ్ హరికృష్ణ ఆధ్వర్యంలో విస్తతమైన పోలీస్ బందోబస్తు మధ్య గురువారం నిర్వహించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగాక వరుస వాహనాలను శారద నగర్ బైపాస్, శ్రీ కన్య జంక్షన్, పెద్దబొడ్డేపల్లి మీదుగా జోగినాదునిపాలెం వద్ద బహిరంగ సభ ప్రదర్శన వరకు ట్రయిల్ రన్ జరిగింది. సీఎం కాన్వాయ్‌లో జామర్, కాన్వాయ్, అంబులెన్స్ తదితర వాహనాలు ఉన్నాయి. బలిఘట్టం నుండి జోగినాధునిపాలెం సభా ప్రాంగణం వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర పార్టీ జెండాలను రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. సిఎంతో ఎమ్మెల్యే ఫోటోలతో భారీ కటౌట్లు ఏర్పాటు చేసి పూర్తి ముస్తాబు చేశారు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ పార్టీ జెండాను ఏర్పాటు చేశారు. అడుగడుగునా డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

సిఎం సభ ప్రాంగణం రెడీ

జోగినాధునపాలెం వద్ద జరగబోయే సీఎం సభాస్థలిని సిద్ధం చేశారు. ఈ సభాస్థల్లో 50 వేల మంది సీఎం సభను వీక్షించేలా ఏర్పాటు చేశారు. 1250 మంది పోలీస్ సిబ్బందిని నియమించారు.వీరిలో ఏడు మంది అడిషనల్ ఎస్పిలు, 12మంది డిఎస్పిలు, 35 మంది సిఐలు, 92 మంది ఎస్ఐలు, 225 మంది ఏఎస్ ఐలు, 496 మంది కానిస్టేబుళ్ళు, 116 మంది మహిళా కానిస్టేబుళ్ళు, 262 మంది హెూంగార్డులు, 600 ఏఆర్ స్పెషల్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈ ప్రాంతాన్ని పోలీసులు తమ ఆదీనంలోకి తీసుకున్నారు. మూడంచెల భద్రత ఉంటుంది. సిఎం విశాఖపట్నంకు విమానంలో వస్తారు. అక్కడి నుంచి నర్సీపట్నంకు హెలికాప్టర్లో రానున్నారు.

తెగిన గాలిపటం జివిఎల్

రీ ఆర్గనైజేషన్ యాక్టివ్‌పై చర్చకు సిద్ధమా?

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సవాల్

ప్రజాశక్తి గ్రేటర్ విశాఖ బ్యూరో

రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు తెగిన గాలిపటం అని, ఉత్తరప్రదేశ్ నుంచి ఎగిరి విశాఖకు వచ్చి చేరారని, ఆయనకి ఏపీ ఉత్పత్తుల గురించి ఏం తెలుస్తుందని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ జివిఎల్ గురువారం చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఐటి ఉత్పత్తులలో రాష్ట్రం వెనుకబడి ఉందని జివిఎల్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండిస్తూ, రాష్ట్రం నుంచి సుమారు 19 బిలియన్ డాలర్ల మెరైన్ ఉత్పత్తులు అవుతున్న విషయం ఆయనకు తెలుసా? అని ప్రశ్నించారు. ఐటి విషయానికి వస్తే, విశాఖలో ఐటికి బీజం వేసింది రాజశేఖరరెడ్డి అన్నారు. విశాఖ నుంచి త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఇన్ఫోసిస్ యాజమాన్యం అధికారికంగా లేఖ ఇచ్చిందని, మరికొన్ని ఐటి దిగ్గజ కంపెనీలు విశాఖ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్న విషయం తెలియక ఆయన నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. స్టేట్ రిఆర్గనైజేషన్‌పై చర్చించేందుకు జివిఎల్ సిద్ధంగా ఉన్నారా? విభజన అంశాలపై చర్చించడానికి ఆయన ముందుకు వస్తారా? అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై వైఖరి జివిఎల్ చెప్పగలరా? అని ప్రశ్నించారు. మూడు నెలల కిందట విశాఖ వచ్చిన జివిఎల్ కు ఇక్కడి పరిస్థితులు ఏం తెలుసని మాట్లాడుతున్నారన్నారు.

బాక్సింగ్ పోటీలకు శ్రీను ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:ఈనెల 31 నుండి జనవరి 6 వరకు హర్యానాలో జరగనున్న 6వ సీనియర్ నేషనల్ మెన్ బాక్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం తరపున నర్సీపట్నంకు చెందిన ముప్పల శ్రీను 48 కేజీల విభాగం సీనియర్ మెన్ కేటగిరిలో ఆడుతున్నాడు.. శ్రీను గత నెలలో విజయనగరంలో సీనియర్ స్టేట్లో గోల్డ్ మెడల్ సాధించి ఈ టోర్నమెంట్కి అర్హత సాధించి నేషనల్ గేమ్స్ గుజరాత్లో కూడా పాల్గొన్నాడు. నింజాస్ అకాడమీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, వెలగా జగన్నాథ్, పి.శ్రీనివాస్, శివ, సుమ, సతీష్‌లు బాక్సర్ శ్రీనుకి ట్రాక్ సూట్ ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనును ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వేంకటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా బాక్సింగ్ అసోసి యేషన్ మెంబర్లు, శాప్ కోచ్ అబ్బు అభినందించారు.

26నుండి పాదయాత్రలు

ఏపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి -పాయకరావుపేట:రాహూల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర జనవరి 26తో ముగుస్తున్నందున దీనికి కోనసాగింపుగా హత్ సే హత్ జోడో అబియాన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 175 నియోజక వర్గాలలో పాదయాత్రుల చేపడతామని ఏపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు వెల్లడించారు.ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల పర్యటనలను విజయవంతంగా ముగించుకుని పాయకరావుపేట మీదుగా వెళ్ళుతున్న్ రుద్రరాజు బృందానికి స్థానిక వైజంక్షన్‌లో నియోజక వర్గ ఇన్ చార్జ తాళ్ళూరి విజయ్ కుమార్, కో ఆర్డినేటర్ జగతా శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట కాంగ్రెస్ కో ఆర్డినేషన్ మెంబర్ రుత్తల శ్రీరామ్మూర్తి, ఏపి ప్రధాన కార్యదర్శి బోడ్డు శ్రీనివాసులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దగ్గుపల్లి బాలరాజు, నక్కపల్లి మండలం అధ్యక్షుడు ప్రగడ చక్రి, నాయకుడు అప్పలరాజు, గారా పావని, అర్జున్, జి సాయి వినయ్, గణేష్ పాల్గోన్నారు.

రుద్రరాజుకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

గ్రాస్ కటింగ్ యంత్రాలతో పశుగ్రాసం ఆదా

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో పశు వైద్యశాల వద్ద మండలానికి సంబంధించి ఐదు పశు గ్రాస్ కటింగ్ యంత్రాలు అందజేసినట్లు స్థానిక పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సింహాద్రప్పడు తెలిపారు. దాదాపు 34 వేల విలువగల యంత్రాన్ని రూ.13500 సబ్సిడీతో 20,300లకు అందజేశామని తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడ్డి కత్తిరించి యంత్రాలు వినియోగించడంతో పశు దాన, పశుగ్రాసం ఆదా అవుతుందని తెలిపారు. పసుశులు సునాయాసంగా మేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, పాడి పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పశువైద్యులు పాల్గొన్నారు..

యంత్రాన్ని ఇస్తున్న సింహాద్రప్పడు

మర్రిపాలెం గెడ్డ సమస్యపై అధికారుల్లో కదలిక

ప్రజాశక్తి- కంచరపాలెం : జివిఎంసి 57వ వార్డు, మర్రిపాలెం శ్యామ్‌నగర్ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న గెడ్డ సమస్య పరిష్కారంపై అధికారుల్లో కదలిక వచ్చింది. స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు సమస్యపై పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు సంబంధిత రైల్వే జిఎం, డిఆర్‌ఎంలతోపాటు జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించారు. గురువారం ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో రైల్వే, జివిఎంసి అధికారులు శ్యాంనగర్ గెడ్డ సమస్యను స్వయంగా పరిశీలించారు. గెడ్డ వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను మరోమారు ఎమ్మెల్యే గణబాబు అధికారులకు విన్నవించగా, వారు స్పందించి తక్షణమే తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అలాగే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే గణబాబు సూచించారు. కార్యక్రమంలో 57వ వార్డు అధ్యక్షుడు పెంటకోట అజయ్‌వాబు, నారాయణ, చిన్న, శ్రీను, స్థానిక మహిళలు పాల్గొని, గెడ్డ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్న ఎమ్మెల్యే గణబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

అదుపులో నేరాలు : సిపి శ్రీకాంత్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ నగరంలో గడిచిన ఏడాది కాలంలో శాంతి బద్రతలు, నేరాలు అదుపులో ఉన్నాయని పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ తెలిపారు. 2022 సంవత్సరములో విశాఖ పోలీస్ శాఖ సాధించిన ప్రగతి, ఛేదించిన కేసుల వివరాలను గురువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. 2021లో 14,315 కేసులు నమోదు కాగా, 2022లో 10,834 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్, అసాంఘిక శక్తులపై నిఘా, ప్రజలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం, తక్షణ అరెస్టులు, బైండ్ ఓవర్ తదితర చర్యలు వల్ల 17.55 శాతం నేరాలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. నేరచరితకలిగిన వారికి నగర బహిష్కరణ, మాదక ద్రవ్యాలు రవాణా చేసినవారిపై ఉక్కుపాదం మోపడం, పాత నేరస్తులు, జైలు నుండి విడుదలైన వారిపై నిఘా, వార్డు మహిళా పోలీసుల సేవలతో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. 2022లో 38 హత్యలు, ఆస్తి దొంగతనాలు 847 కేసులు నమోదు అయ్యాయని, ఈ కేసుల్లో మొత్తం రూ.5.54 కోట్ల ఆస్తి పోగా, రూ.3.26 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మహిళలపై జరిగిన నేరాలపై 1318 కేసులు నమోదయ్యాయని, గత ఏడాది కంటే 29.40 శాతం తగ్గాయని వివరించారు. కుటుంబ హింసపై 718 కేసులు, మహిళల మానభంగంనకు సంబంధించి 125 కేసులు, పిల్లలకు సంబంధించి 121 కేసులు, దళిత గిరిజనులపై 134 కేసులు, మోసపూరిత నేరాలు 222 కేసులు నమోదయ్యాయని, ఇవి గత ఏడాది కంటే 34.51 శాతము తగ్గుముఖం పట్టాయని తెలిపారు. కుటుంబ కలహాలు, క్షణికావేశముతో తీసుకున్న నిర్ణయాలు, ఆరోగ్య సమస్యలు, ప్రమాదవశాత్తు జరిగిన మరణాల్లో 800 కేసులు నమోదు అయ్యాయని వివరించారు.

ట్రాఫిక్ విభాగంలో గడిచిన ఏడాది కాలంలో రోడ్డు ప్రమాదాలు 1327 జరిగాయని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 8893, హెల్మెట్ ధరించని వారు 3,72,109మందిపై, ఓవర్ స్పీడుతో 40,270 మందిపై ట్రిపుల్ రైడింగ్‌లో 21,743 కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ నేరాలు 2021లో 316 నమోదు కాగా, 2022లో 610 కేసులు నమోదైనట్లు తెలిపారు. సైబర్ నేరాలుపై 1930 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు వల్ల ప్రజలలో అవగాహన పెరిగి కేసుల నమోదు ఎక్కువైనట్లు వివరించారు. 2022లో 529 బ్యాంకు అకౌంట్లు ఫ్రీజింగ్ చేసినట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల రవాణాకు సంభందించి 252 కేసుల్లో 598 మందిని అరెస్టుచేసి, 6010 కేజీల గంజాయిని, 360 గ్రాముల వీడ్ ఆయిల్, 1.427 గ్రాముల ఎండిఎంఎ పొడిని, 8000 మాత్రలు, 3803 ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశా, ఉత్తరప్రదేశ్, బీహార్, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, వెస్ట్ బెంగాల్ తదితర 18 రాష్ట్రాలకు చెందిన 220 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఈ సంవత్సరం 1,22,545 మందిచే దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేయించినట్లు తెలిపారు. పాతకక్షలకు సంబంధించి- 91, రౌడీ కార్యకలాపాలు-97, భూవివాదాలు -145, గృహహింస-280, మద్యం అమ్మకాలు 246 కేసులను మహిళా పోలీసులు గుర్తించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి-1 సుమిత్ గరుడ్, డిసిపి-2 ఆనంద్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.